
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 36.0 । కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5

వనపర్తి
జిల్లా వార్తలు
సోమవారం 3 మార్చి 2025

మైసమ్మ దర్శనానికి
పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినోనిపల్లి శివారులో వెలసిన మైసమ్మ దేవత దర్శనం కోసం ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20వేల మంది భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకున్నారు. భక్తుల నుంచి దేవాలయానికి లక్షా 5వేల 262 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్‌శర్మ తెలిపారు.





వనపర్తిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పురోహితుల ఆశీర్వాదం తీసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, మంత్రి దామోదర రాజనరసింహ, ఎంపీ మల్లు రవి, మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తదితరులు

వనపర్తి సభకు
అశేషంగా హాజరైన ప్రజలు

అమాయకత్వం కాదు మాది
మంచితనం

- తక్కువ చేసి, అవమానిస్తే డొక్క చీల్చి డోలు కడతాం
- వనపర్తి పట్టణంతో నాది తెగిపోని పెనవేసుకున్న అనుబంధం
- సంస్కారం, నీతివంతమైన రాజకీయాలు నేర్పింది ఈ ప్రాంతమే..
- నేను ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నానంటే వనపర్తిది ప్రత్యేకత ఉంది
- ఎంత ఎదిగినా.. రాష్ట్రానికి, దేశానికి వన్నె తెచ్చిండనే కీర్తి తీసుకొస్తా..
- చాలామంది నేతలు ఇక్కడ పైసల ప్రభావం లేకుండా పాలించారు
- అయిదేళ్ల కింద గెలిచిన వ్యక్తి అవినీతితో పేరును కలుషితం చేశాడు
- జయరాములు, బాలకిష్టయ్య పేర్లను ప్రభుత్వ భవనాలకు పెడతాం
- వనపర్తి ప్రజాపాలన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్/వనపర్తి అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలమూరు ప్రజలది అమాయకత్వం కాదని, మంచితనమని, తక్కువ చేసి చూసి.. అవమానించాలని చూస్తే డొక్క చీల్చి డోలు కడతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఆదివారం పర్యటించిన ఆయన.. రూ.879.80 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించిన ప్రజాపాలన బహిరంగ సభలో ప్రసంగించారు. వనపర్తిలో తనది అభివృద్ధి, రాజకీయ పర్యటన మాత్రమే కాదని అన్నారు. ఇక్కడ చదువుకున్న రోజుల్లో వనపర్తి సంస్కారం నేర్పిందని, విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో ఎలా రాణించాలో నేర్పించిందని, వనపర్తి నుంచే సర్వం నేర్చుకున్నానని అన్నారు. తాను ప్రస్తుతం ఈ స్థాయిలో ఉన్నానంటే వనపర్తికి ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు. వనపర్తి ప్రజలతో, పట్టణంతో తనది తెగిపోని పెనవేసుకున్న అనుబంధమని తెలిపారు. ఎంత ఎత్తుకు ఎదిగినా వనపర్తి నియోజకవర్గాన్ని మరిచిపోనని, ఏ స్థాయిలో రాణించినా.. రాష్ట్రానికి, దేశానికి కీర్తి తెచ్చాడన్న పేరు తీసుకువస్తానని అన్నారు. జయరాములు, బాలకిష్టయ్య, రావుల, చిన్నారెడ్డి రాజకీయాల్లో కక్షలు లేకుండా ఉన్నత విలువలతో పాలించారని అన్నారు. ఐదేళ్ల క్రితం గెలిచిన వ్యక్తి వనపర్తిని అవినీతితో కలుషితం చేశారని, గొప్పపేరును దెబ్బతీశారని విమర్శించారు. ఎంపీలుగా పని చేసిన రామేశ్వర్‌రావు, మహేంద్రనాథ్, జితేందర్‌రెడ్డి, మల్లికార్జున్, మల్లు రవి ఈ ప్రాంతానికి ఎంతో పేరు తెచ్చారని అన్నారు. పేదల పిల్లలకు సాంకేతిక విద్య అందడం కోసం కోటను

(మిగతా 6లో..)



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి; చిత్రంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

- వేంకటేశ్వరుడికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం

- బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం

6

పూర్వ మిత్రులను కలవడం సంతోషాన్నిచ్చింది

- ఆత్మీయ కలయికలో రేవంత్‌రెడ్డి

సొంత అక్కలా.. ఆప్యాయత చూపింది

- అద్దెకు ఉన్న ఇంటి కుటుంబ సభ్యులను కలిసిన రేవంత్‌రెడ్డి

సభలో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





సీఎంకు జ్ఞాపికను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి



వనపర్తిలో చదువుకునేటప్పుడు తను అద్దెకు ఉన్న ఇంట్లో ఆ కుటుంబ సభ్యులు ఇచ్చిన టిఫిన్ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లను ప్రారంభిస్తున్న సీఎం తదితరులు



ఆత్మీయ కలయికలో స్కూల్ ఫ్రెండ్స్‌తో కలిసి భోజనం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నల్లమల జల్లెడ

- సీఎం రాక కోసం హుటాహుటిన ఏర్పాట్లు
- ఆగమేఘాలపై రంగంలోకి దిగిన అధికారులు

6

లాభాల పందిరి

- కూరగాయల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- అర ఎకరానికి రూ. 50 వేలు
- ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు అవకాశం
- పాలమూరుకు 20 యూనిట్లు

భూత్పూర్ మండలంలో పందిరి సాగు చేసిన కాకర (ఫైల్)



7

నీళ్ల గంట మోగాలి

- ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో అమలు
- విద్యార్థులు తగినంత నీరు తాగకపోతే దుష్ఫలితాలు
- ప్రభుత్వ, ప్రైవేట్ బడుల్లో అమలు చేయాలి
- సూచిస్తున్న వైద్యులు, విద్యావేత్తలు



భోజన సమయంలో నీటి గ్లాసులు చూపిస్తున్న ఉత్తనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

7

అడుగడుగునా నీటి ధారలే

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో నీటి ఊటలతో రెస్క్యూకు ఇబ్బందులు
- ప్రభుత్వానికి చెప్పిన బృందాలు
- జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాను నివేదిక కోరిన ప్రభుత్వం



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పైభాగంలో భూమిని పరిశీలిస్తున్న జియోలాజికల్ సర్వే అధికారులు

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో అడుగడుగునా నీటి ధారలే కనిపిస్తున్నాయి. రెస్క్యూ బృందాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విషయమై నివేదికలు అందించారు. ఈ క్రమంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాను నివేదిక కోరగా అధికారులు రంగంలోకి దిగారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ చుట్టూ భూమి స్వభావం, అంతర్గత పొరలపై పరిశోధన ప్రారంభించనుంది. నల్లమలలోని సలేశ్వరం, మల్లెలతీర్థం, లొద్ది, ఉమామహేశ్వరం వంటి అనేక జలపాతాలున్నాయి. నదీ పరివాహక ప్రాంతం కావడంతో ఇక్కడ తరుచూ నీటి ఊట కనిపిస్తోంది. వర్షాకాలంలో జలపాతాల ప్రవాహం అధికంగా ఉంటుంది. దాదాపు 4 ఏళ్లుగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు నిలిచిపోవడం, రెండేళ్లుగా కృష్ణానదికి విపరీతమైన వరద రావడంతో భూమి అంతర్గత పొరలనుంచి నీటి ఊట అధికమైనట్లు జియోలాజికల్ నిపుణులు అంచనా వేసినట్లు సమాచారం. ప్రస్తుతం టన్నెల్ కూలిన 14వ కిలో మీటర్ దగ్గర అన్ని కోణాలలో సర్వే చేయనున్నారు. అటవీశాఖ అధికారులు కూడా టన్నెల్ ఉపరితలంలో 14వ కిలో మీటర్ వద్ద శనివారం అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా అక్కడి పరిస్థితులను పరిశీలించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో
మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పెబ్బేరు రూరల్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-16 క్రికెట్ పోటీల్లో పెబ్బేరు మోడల్ స్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్ తెలిపారు. గత నెల 28న మేడ్చల్ జిల్లా ఈసీఐఎల్‌లో ప్రారంభమైన టీ10 అండర్-16 క్రికెట్ టోర్నమెంట్‌లో 14 జిల్లాల నుంచి 14 జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నీలో పెబ్బేరు మోడల్ స్కూల్ విద్యార్థుల జట్టు ఫైనల్‌కు చేరుకున్నది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కామారెడ్డి జిల్లా జట్టుపై విజయం సాధించిందని ఆయన తెలిపారు. టీ10 క్రీడాపోటీల రాష్ట్ర కార్యదర్శి మామిడి శ్రీధర్, కోశాధికారి సందీప్ చేతుల మీదగా ట్రోఫీ, రూ.30 వేల నగదు అందుకున్నారని ఆయన తెలిపారు.



ట్రోఫీ అందుకుంటున్న పెబ్బేరు మోడల్ స్కూల్ విద్యార్థులు


దేవాలయ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

కందనూలు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామంలో మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణోత్సవానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి గతంలో నిధులను మంజూరు చేశామని, రాబోయే రోజుల్లో కూడా ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంతోష్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



నల్లమలలో మళ్లీ మంటలు

- అదుపు చేసేందుకు అటవీశాఖ సిబ్బంది యత్నం

7

అమాయకత్వం కాదు మాది.. మంచితనం

(5వ పేజీ తరువాయి)

దానం చేసి, మొట్టమొదటి పాలిటెక్నిక్ కళాశాలను నెహ్రూ చేతుల మీదుగా రామేశ్వర్‌రావు ప్రారంభించారని అన్నారు. సరళాసాగర్ సైఫన్ సిస్టం ప్రాజెక్టు ఇప్పటికీ ప్రపంచంలోనే పేరుగాంచిందన్నారు. జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, తుమ్మిళ్ల, ఆర్డీఎస్, కల్వకుర్తి ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలోనే వచ్చాయన్నారు. రాజకీయాల్లో విలువలు పెంచడం ఇక్కడి నుంచే నేర్చుకున్నానని, తనతో చదివిన స్నేహితులను కలిశానని, ఇంకా కొందరు రాలేదని, వారిని త్వరలోనే కలుస్తానన్నారు. చదువుకునేప్పుడు ఎవరి ఇంట్లో ఉన్నానో వారి ఇంటికి వెళ్లి వచ్చానన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సహకారంతో రూ.1,000 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశానని చెప్పారు. చాలామంది నేతలు ఇక్కడ పైసల ప్రభావం లేకుండా రాజకీయాలు చేశారన్నారు. ఈ వేదికగా రూ.100 కోట్ల రుణాలను ఆడబిడ్డలకు అందించుకోవడం గర్వంగా ఉందన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు మాజీ ఎమ్మెల్యే జయరాములు పేరు, 500 పడకల ఆస్పత్రికి పేదల డాక్టర్, రెండుసార్లు ఎమ్మెల్యే అయిన డాక్టర్ బాలకిష్టయ్య పేరును పెట్టాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచించారని, ఆ ప్రకారం పేర్లు పెట్టాలని నిర్ణయించామన్నారు. చర్యలు తీసుకోవాలని సీఎస్ శాంతకుమారికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే కాశీంనగర్ ఎత్తిపోతల పథకం మంజూరు చేస్తున్నామని, ఉస్మానియా, నిమ్స్‌లో పాలమూరు వాసులకు ఉచిత సేవలు అందించిన పేదల డాక్టర్ జిల్లెల మాధవరెడ్డి పేరును ఈ లిఫ్టుకు పెడతామని అన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జి. మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, రాజేష్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, గద్వాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ నేతల పేర్లు పెట్టాలి



వనపర్తికి సుదీర్ఘకాలం నిస్వార్థ సేవలు అందించిన బీసీ నేతల పేర్లను ప్రభుత్వం చేపట్టబోయే నిర్మాణాలకు పెట్టాలని, గతంలో మట్టిని తవ్వి, రివిట్‌మెంట్‌లతో పూత పూసి వారి పేర్లను పెట్టుకున్నారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు జయరాములు పేరు, 500 పడకల ఆస్పత్రికి డాక్టర్ బాలకిష్టయ్య పేరు పెట్టాలని సీఎంను కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వనపర్తి నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.375 కోట్ల అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రాకతో ఆదివారం మరో వెయ్యి కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో 500 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, పెబ్బేరులో 30 పడకల ప్రభుత్వాసుపత్రికి శంకుస్థాపనలు చేసుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 100 గ్రామాలకు గ్రామీణ రోడ్లను మంజూరు చేసిన గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు ధన్యవాదాలు అని తెలిపారు. జిల్లాలో సంక్షేమ హాస్టళ్లు ప్రైవేటు భవనాలలో ఉన్నాయని, వాటికి పక్కా భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాలకు రెన్యువేషన్ చేసేందుకు నిధులు మంజూరు చేసి, పూర్వ వైభవం తీసుకురావాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అదే విధంగా జేఎన్‌టీయూ కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, దీంతో పాటు జిల్లాలోని 133 గ్రామ పంచాయతీలు, రెండు మునిసిపాలిటీలకు ఎస్‌డీఎఫ్ కింద నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.

- తూడి మేఘారెడ్డి, ఎమ్మెల్యే వనపర్తి

వనపర్తి నుంచే కొత్త పథకం ప్రారంభం



వనపర్తి నియోజకవర్గం అత్యంత రాజకీయ చైతన్యవంతమైన ప్రాంతమని, ఈ ప్రాంతం నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు పాలన చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో అప్పటి ఇందిరమ్మ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పని చేసిందని, కార్పొరేషన్‌లకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించేదని గుర్తు చేశారు. దురదృష్టవశాత్తు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మాత్రం నాటి ప్రభుత్వం కార్పొరేషన్‌లకు ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు తరువాత తమ కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్లకు రూ.6 వేల కోట్లను కేటాయించిందన్నారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ గ్రూపులకు ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలలోగా రూ.6 వేల కోట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. వనపర్తి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.2,200 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థి దశ నుంచి ఇక్కడి ప్రజల కష్ట సుఖాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేల కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టారన్నారు.

- మల్లు భట్టి విక్రమార్క, ఉప ముఖ్యమంత్రి

విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం



సామాజికంగా వెనుకబడిన కులాలను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా కులగణన చేపట్టి 50 రోజుల్లో పూర్తి చేసిందని నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి అన్నారు. ఈ కులాల్లో ఎంత మందికి ఉపాధి ఉంది, వారి ఆర్థిక స్థోమత ఏంటనేది సర్వే ద్వారా తెలుసుకోవడం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 56 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు రూ.200 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో అన్ని కులాల, మతాల విద్యార్థులు చదువుకుంటారని, దేశంలోనే ఇదొక విప్లవాత్మకమైన మార్పుగా అభివర్ణించారు. వనపర్తి జిల్లా వాసి శ్రీనివాస్ శెట్టి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్‌గా ఉండడంతో ఆయన కొత్తగా 6 బ్రాంచ్‌లను నేడు ప్రారంభోత్సవం చేయడం జరిగిందన్నారు. అచ్చంపేటలో గిరిజనులను అడాప్ట్ చేసుకుని వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. తన కృషి వల్ల యూనియన్ బ్యాంక్ ద్వారా జిల్లాలో ఐదు కొత్త బ్రాంచ్‌లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం కల్పించేందుకు యూనియన్ బ్యాంక్ ముందుకు వచ్చిందన్నారు. జాబ్ మేళా నిర్వహించి 295 మందికి ఆయా సంస్థల్లో ఉద్యోగాలు కల్పించడం జరిగిందని, వారికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు.

- డాక్టర్ మల్లు రవి, ఎంపీ, నాగర్‌కర్నూలు

సొంత అక్కలా.. ఆప్యాయత చూపింది

» అద్దెకున్న ఇంటి యజమాని పార్వతమ్మ కుటుంబ సభ్యులను కలిసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డిని తమ ఇంట్లోకి ఆహ్వానిస్తున్న పార్వతమ్మ కుటుంబ సభ్యులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తను వనపర్తిలో చదువుకునే రోజుల్లో సొంత అక్కలా ఆప్యాయత చూపిన పార్వతమ్మ కుటుంబాన్ని ముఖ్యమంత్రి హోదాలో కలవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వనపర్తికి వచ్చిన సందర్భంగా తాను 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే రోజుల్లో అద్దెకు ఉన్న పార్వతమ్మ ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా పార్వతమ్మ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రిని సాదరంగా ఆహ్వానించారు. పార్వతమ్మ కుటుంబ సభ్యులను సీఎం ఆప్యాయతతో పలుకరించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి హోదాలో తన ఇంటికి రేవంత్‌రెడ్డి రావడంతో పార్వతమ్మ ఆనంద బాష్పాలతో స్వాగతం పలికింది. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, సాయిచరణ్ రెడ్డి, శివసేనా రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



పార్వతమ్మ కుటుంబ సభ్యులతో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

వనపర్తి రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో వివిధ అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసిన శిలాఫలకాలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రం, మండలంలో రూ.40 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు, నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.510 కోట్లు, నూతన ఐటీ టవర్ భవన నిర్మాణానికి 22 కోట్లు , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు రూ.47.50 కోట్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు, 30 పడకల ఆసుపత్రి భవనం పెబ్బేరు నిర్మాణపు పనులకు రూ.11.20 కోట్లు, శ్రీరంగాపూర్ ఆలయానికి పర్యాటకంగా అభివృద్ధి పరిచేందుకు 1.5 కోట్లు, రూ.35 కోట్ల వ్యయంతో సీఆర్ఆర్ రోడ్ల పనులు, రూ.12.60 కోట్ల వ్యయంతో గిరిజన ఆవాసాల అభివృద్ధి పనులకు చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు.

దీంతో పాటు కాశీంనగర్ లిఫ్టు ఇరిగేషన్ స్కీం సమగ్ర సర్వే పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, జిల్లా ఇన్‌చార్జి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, వివిధ శాఖల రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● జనసంద్రంగా మారిన పట్టణం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత జిల్లాకు తొలిసారి రావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. దీంతో వనపర్తి పట్టణం ఒక్కసారిగా జన సంద్రంగా మారింది. సీఎం 4 గంటల 30 నిమిషాలకు పైగా జిల్లా కేంద్రంలోనే ఉండడంతో ఆ ప్రాంతం అంతా జనాలతో కిటకిటలాడింది. జనం రద్దీతో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందు లు లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సభకు వచ్చే ప్రజలతో పాటు నాయకులు, వీఐపీల వాహనాలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.



బహిరంగ సభకు తరలివస్తున్న ప్రజలు

● ప్రశాంతంగా ముగిసిన సీఎం పర్యటన

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ప్రశాంతంగా ముగిసింది. వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలతో పాటు, బహిరంగ సభ ఏర్పాట్ల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆధ్వర్యంలో 1000 మంది పోలీస్ సిబ్బందితో అడుగడుగునా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐజి సత్యనారాయణతో పాటు, జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొని భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.

వేంకటేశ్వరుడికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం



వేంకటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, పక్కన చిన్నారెడ్డి

వనపర్తి రాజీవ్ చౌరస్తా, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు వచ్చిన ఆయన స్వామి వారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు గోత్రనామాలతో అర్చనలు నిర్వహించి స్వామి వారి శేష వస్త్రంతో పాటు స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కృపతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థించినట్లు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆలయ అర్చకులకు సూచించారు. అంతకుముందు ముఖ్యమంత్రితో పాటు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి దేవాలయానికి రాగా, మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు.

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి చేదు అనుభవం

వేంకటేశ్వర స్వామి ఆలయంలోకి సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు కాంగ్రెస్ నాయకులు వెళ్లగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్‌ను మాత్రం పోలీసులు లోపలికి వెళ్లనివ్వలేదు. తాను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడినని ఆలయం లోపలికి అనుమతించాలంటూ ఆయన కోరినా పోలీసులు ససేమిరా అన్నారు. దీంతో ఆయన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చేసేదేమి లేక అసహనంతో ఆయన వెనుదిరిగి వెళ్లిపోయారు. అధ్యక్షుడితో పాటు కొంతమంది యువ నాయకులు కూడా తమను లోపలికి అనుమతించాలంటూ పోలీసులను అడిగారు. అర్హత లేని నాయకులను లోపలికి పంపి పార్టీ కోసం కష్టపడిన వారిని బయట ఎలా ఉంచుతారని ప్రశ్నించారు. యువ నాయకులు కూడా అసహనంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నల్లమల జల్లెడ

- సీఎం రాక కోసం హుటాహుటిన ఏర్పాట్లు
- ఆగమేఘాలమీద రంగంలోకి దిగిన అధికారులు

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్, మార్చ్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటనా స్థలానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఆకస్మికంగా ఖరారు కావడంతో అధికారులు ఆఘమేఘాల మీద ఏర్పాట్లు చేశారు. పోలీసులు నల్లమలను జల్లెడ పట్టారు. ఆదివారం వనపర్తి పర్యటనకు వచ్చిన సీఎం ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను సందర్శించాలని నిర్ణయించారు. హెలికాప్టర్ ల్యాండింగ్ విషయంలో సెక్యూరిటీ అనేక అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ కచ్చితంగా ఎస్ఎల్‌బీసీని సందర్శించి వెళతానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దాంతో అప్పటికే ఒక హెలిప్యాడ్ ఉండగా, యుద్ధప్రాతిపదికన మరో హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. సీఎం పర్యటన అంశం మధ్యాహ్నం 12 గంటలకు అధికారికంగా ఖరారు కాగా వందలాదిమంది పోలీసులు దోమలపెంటకు చేరుకున్నారు. సంఘటన జరిగిన ప్రదేశంలో పురోగతిపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ప్రత్యేకమైన నివేదికను రూపొందించారు. సీఎం పర్యటిస్తారని తెలియడంతో అధికార యంత్రాంగం, పోలీసులు ఇతర సిబ్బంది అప్రమత్తమయ్యారు. అచ్చంపేటనుంచి సున్నిపెంట వరకు ప్రత్యేకంగా పెట్రోలింగ్ విభాగాన్ని ఏర్పాటుచేసి తనిఖీలు నిర్వహించారు. నల్లమల సున్నిత ప్రాంతం. ఒకప్పుడు మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతంకావడంతో సీఎం పర్యటకు పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతాన్ని పూర్తిగా జల్లెడ పట్టి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ అక్కడికి చేరుకుని సహాయక చర్యలో పాల్గొన్న సిబ్బందితో అత్యవసర సమావేశం అయ్యారు. పనుల పురోగతిపై ప్రత్యేక నివేదికను రూపొందించారు.

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం

- ● అడుగడుగునా స్వాగతం పలికిన నాయకులు, అభిమానులు, కార్యకర్తలు
- ● బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం



వనపర్తి పట్టణంలో మైనారిటీ మహిళలకు చెక్కును అందజేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

వనపర్తి అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వనపర్తి జిల్లా పర్యటన విజయవంతమైంది. జిల్లా కేంద్రంలో 4 గంటల 30 నిమిషాలు సీఎం పర్యటన కొనసాగింది. ఉదయం 12:12 నిమిషాలకు హెలిప్యాడ్‌లో పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణం వెనకాల దగ్గరికి హెలిప్యాడ్ స్థలానికి చేరుకున్నారు. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, చీఫ్ సెక్రటరీ శాంతకుమారికి మంత్రి జూపల్లి, ఎంపీ మల్లు రవి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి , ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి , వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు.

ఉద్యోగ నియామక పత్రాల అందజేత

ఈ నెల 1వ తేదీ జిల్లా కేంద్రంలో జిల్లా ఉపాధి కల్పన శిక్షణ శాఖ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మే ఘారెడ్డి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో ఎంపికైన యువతి, యువ కులకు ఉద్యోగ నియామక పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకు లింకేజీ కింద రూ.1001 కోట్లు చెక్కులను వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల మహిళా సంఘాల మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక తోడ్పాటు కింద స్వయం ఉపాధి యూనిట్‌కు ఒక్కొక్క కార్పొరేషన్ ద్వారా ఐదుగురికి మొత్తం 15 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అదే పర్వువల్‌గా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి, వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేయబోయే యూనియన్ బ్యాంకులను ప్రారంభించారు. అనంతరం పీఎంఈజీపీ కింద ముద్ర, సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలకు హెస్‌హెచ్‌జీలకు రూ.210 కోట్ల చెక్కులను అందజేశారు. అదేవిధంగా ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా వ్యవసాయం, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, గృహ నిర్మాణం, వాహన, వ్యక్తిగత రుణ వితరణ రుణాలు వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలకు రూ.275 కోట్ల 52 లక్షలను చెక్కును ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. అదే విధంగా డీసీసీబీ ద్వారా వ్యవసాయ, గొర్రెలు, డైరీ యూనిట్‌లకు రూ.202 కోట్ల చెక్కు, హెచ్‌డీఎఫ్‌సీ ద్వారా రూ.35 కోట్ల చెక్కు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా హార్వెస్టర్‌లు, రైస్ మిల్లులు, బేకరీ, డైరీ యూనిట్‌ల లబ్ధిదారులకు రూ.150 కోట్ల 80 లక్షల చెక్కును పంపిణీ చేశారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ద్వారా ఎన్ఎస్ఎంఈ, స్వయం సహాయక మహిళా బృందాలకు రూ.80 కోట్లు చెక్కును అందజేశారు.

పూర్వ మిత్రులను కలవడం సంతోషాన్నిచ్చింది



పూర్వ మిత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి

» ఆత్మీయ కలయికలో సీఎం రేవంత్‌రెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వనపర్తిలో తాను చదువుకున్న రోజులను మరిచి పోలేనని, తాను చదివిన వనపర్తి పాఠశాల, కళాశాల పూర్వ మిత్రులను కలుసుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తిలో ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ మిత్రులతో అపూర్వ కలయిక కార్యక్రమానికి హాజరయ్యారు. వనపర్తిలో పాఠశాల విద్యతో పాటు ఇంటర్ వరకు ఆయన చదువుకున్నారు. విద్యనభ్యసించా రు. సీఎం హోదాలో తన ఆత్మీయ మిత్రులను కలవడానికి రావడంతో ఆయనను కలిసేందుకు దాదాపు 125 మంది పాఠశాల, కళాశాల స్నేహితులు రేవంత్‌రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా తానే స్నేహితుల వద్దకు వెళ్లి అందరిని ఆత్మీయంగా పలకరించారు. మొదటి టేబుల్‌లో కూర్చున్న మిత్రులతో పాటు చివరి టేబుల్ వరకు ఉన్న మిత్రులందరినీ కలిసి వారితో ఫొటోలు దిగారు. తమ స్నేహితుడు ముఖ్యమంత్రి హోదాలో కలుసుకోవడంతో మిత్రులందరూ ఆనందంతో ఉప్పొంగి పోయారు. ఆయనతో కలిసి ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి తనకు చదువు చెప్పిన గురువులను కలిసి నమస్కరించారు. తమ శిష్యుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం, సీఎం హోదాలో వచ్చి తమను కలవడంతో ఆ గురువులు సైతం రేవంత్ రెడ్డిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సీఎం తన భుజాలపై గురువుల చేతులు వేసుకుని వారిని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. చివరగా సీఎం తన స్నేహితులతో కలిసి భోజనం చేశారు. 1983 - 85 ఇంటర్ బ్యాచ్ మిత్రులతో గ్రూప్ ఫొటో దిగారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, ఎంపీ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

సైడ్‌లైట్స్..

● 12:20 గంటలకు పాలిటెక్నిక్ కళాశాల మైదానం నుంచి సీఎం కాన్వాయ్‌లో నేరుగా వల్లభ్ నగర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయానికి చేరుకున్నారు. అక్కడ 30 నిమిషాల పాటు ప్రత్యేక పూజలు చేసి ఒక కోటి రూపాయల ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

● 12:50 గంటలకు అక్కడి నుంచి కాలినడకన తాను గతంలో నివాసం ఉన్న ఇంటి యజమాని పార్వతమ్మ ఇంటికి చేరుకున్నారు. అక్కడ 10 నిమిషాలు వారి కుటుంబ సభ్యులతో గడిపి తేనీటి విందు స్వీకరించారు. అనంతరం అక్కడే ఉన్న ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఇంటికి కాలి నడకన వెళ్లి ఇల్లంతా తిరిగి అక్కడ ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు.

● 1:15 గంటలకు చిన్నారెడ్డి ఇంటి నుంచి నేరుగా బాలుర కళాశాల మైదానంలోని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అనంతరం 1:30 నిమిషాలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రితో గతంలో విద్యను అభ్యసించిన సహచర పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. దాదాపు అక్కడే గంట పాటు వారితో ముచ్చటించి భోజనం చేశారు.

● 2:28 గంటలకు పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభకు చేరుకుని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడిన అనంతరం ముఖ్యమంత్రి మా ట్లాడారు.

● 4:05 గంటలకు బహిరంగ సభలో తన ప్రసంగాన్ని ప్రారంభించిన ముఖ్యమం త్రి 43 నిమిషాల పాటు మాట్లాడారు.

● 4:48 గంటలకు ప్రసంగాన్ని ముగించిన అనంతరం స్టేజీ పక్కనే ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళా శక్తి పథకం, రేవంతన్న భరోసా పథకాలను ప్రారంభించారు.

● 5:10 గంటలకు బహిరంగ సభ ప్రాంగణం నుంచి తన కాన్వాయ్‌లో హెలిప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి హెలిక్యాప్టర్‌లో నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీకి వెళ్లారు.



సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి



బహిరంగ సభలో కళాకారుల నృత్యం


అయిజ పట్టణంలోని ఓ పాఠశాలలో నీరు తాగుతున్న విద్యార్థిని (ఫైల్)

నీళ్ల గంట మోగాలి

» ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో అమలు » విద్యార్థులు తగినంత నీరు తాగకపోతే దుష్ఫలితాలు
» ప్రభుత్వ, ప్రైవేట్ బడుల్లో అమలు చేయాలి » సూచిస్తున్న వైద్యులు, విద్యావేత్తలు

అయిజ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో నీళ్ల గంట మోగాలి.. విద్యార్థులందరూ నీరు తాగాలి అంటున్నారు నిపుణులు, వైద్యులు. నీటి ప్రాధాన్యాన్ని గుర్తించి, వేసవిలో అవసరమైన మేరకు విద్యార్థులు నీరు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆట పాటల్లో పడి పిల్లలు నీరు తాగడాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. దీంతో అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకోసం వేసవి ముగిసే వరకు పాఠశాలల్లో ప్రత్యేక వాటర్ బెల్ అమలు చేయాలని వైద్యులు చెప్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం 10.35, మధ్యాహ్నం 12 గంటలు, సాయంత్రం మూడు గంటలకు మూడు సార్లు నీళ్ల గంట కొడతారు. అప్పుడు విద్యార్థులందరూ నీరు తాగేలా ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 634 ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో 1,22,065 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

నీరు తక్కువైతే దుష్ఫలితాలు

పిల్లలు ఆటల్లో పడి నీరు తక్కువ తాగితే దుష్ఫలితాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. చాలా మంది విద్యార్థులు ఇంటి నుంచి నీళ్ల బాటిల్ తీసుకెళ్తారు కానీ, భోజన సమయంలో మాత్రమే తాగుతున్నారు. దీని వల్ల శరీరంలో నీటి శాతం తగ్గే ప్రమాదం ఉంటుంది. ప్రధానంగా ఆటలాడే పిల్లల్లో చెమట రూపంలో శరీరం నుంచి ఎక్కువ నీరు అధికంగా బయటకు వెళుతుంది. దీంతో అవసరమైనంత నీరు తాగకపోతే శరీ రంలో నీటి శాతం తగ్గుతుంది. దీంతో తలనొప్పి, ఆయా సం (మైల్డ్ డీ హైడ్రేషన్) వచ్చే ప్రమాదం ఉంది. అంతే కాకుండా పిల్లల్లో చురుకుదనం తగ్గడంతోపాటు, యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్‌కు గురవుతారు. కిడ్నీలో రాళ్ల ఏర్పడి యూ రోలిథియా వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో శారీరక సామర్థ్యం దెబ్బతింటుందని, చదువుపై శ్రద్ధ తగ్గుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కేరళ రాష్ట్రంలో 2019 నుంచి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ఏడాది నుంచి వాటర్ బెల్ అమలు చేస్తున్నారు. ప్రతీ వేసవిలో నిర్వహించే ఈ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. అలాగే మన రాష్ట్రంలోనూ 2021లో ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. కానీ అమలుపై పెద్దగా దృష్టి సారించలేదు. ఈ ఏడాది పక్కాగా అమలు చేసేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని వైద్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈనెల 15 నుంచి రాష్ట్రంలో ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. పాఠశాల సమయానికి అనుగుణంగా వాటర్ బెల్ అమలు చేయాలని వైద్యులు, విద్యావేత్తలు సూచిస్తున్నారు.

ఉత్తర్వులు జారీ చేయాలి



పాఠశాలలో వాటర్ బెల్ అమలుకోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలి. అప్పుడే పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యతగా అమలు చేస్తారు.
- తిమ్మారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం ఆదేశిస్తే అమలు



ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే అమలు చేస్తాం. పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కచ్చితంగా అమలు చేస్తాం.
- మహ్మద్ అబ్దుల్ ఘనీ, ఇన్‌చార్జి డీఈవో

క్రైం కార్నర్

లారీ ఢీ కొని మహిళ మృతి

మరికల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మరికల్ మండల కేంద్రంలో లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అనూష (40) ఆదివారం మధ్యాహ్నం సరుకుల కొనుగోలు కోసం దుకాణానికి వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తూ శ్రీనివాస మెస్ సమీపంలో రోడ్డుతుండగా, రాయిచూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఆమెను ఢీకొన్నది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ఎల్లయ్య తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా

» 3 ట్రాక్టర్లు, ఒక టిప్పర్ పట్టివేత

మిడ్జిల్/ రాజాపూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు టాక్టర్లు, ఒక టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మిడ్జిల్ ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు, రాజాపూర్ ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం లోని చిలువేరు గ్రామ శివారులోని వాగులో నుంచి ఆదివారం 3 ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు దాడి చేశారు. వారిని గమనించి డ్రైవర్లు పారిపోయారు. విచారణ చేపట్టి ఆ ట్రాక్టర్లు నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామానికి చెందినవిగా గుర్తించారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. రాజాపూర్ మండల పరిధిలోని రాయపల్లి గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మట్టిలోడ్‌తో ఒక టిప్పర్ వచ్చింది. కాని స్టేబుళ్లు కృష్ణారెడ్డి, కిరణ్‌భార్గవ్‌లు విచారించగా ఫిల్టర్ ఇసుక తయారీ కోసం మట్టిని తరలిస్తున్నట్లు తేలింది. మట్టి తరలింపునకు అనుమతి లేకపోవడంతో డ్రైవర్, యజమాని శ్రీరాంను అదుపులోకి తీసుకున్నారు. టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించారు. రెండు సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐలు తెలిపారు.

పాము కాటుతో రైతు మృతి


సాయిరెడ్డి (ఫైల్)

ఊర్కొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పొలంలో పనిచేస్తున్న రైతును పాము కాటు వేసింది. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కరూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని జకినాలపల్లి గ్రామానికి చెందిన తలసాని సాయిరెడ్డి (65) ఆదివారం తన పొలంలో పని చేసుకుంటుండగా పాము కరిచింది. దీంతో ఆందోళన చెందిన ఆయన భార్య సులోచనతో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి చేరుకున్నారు. కొద్ది సేపటికే పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు ఆయనను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు.

చెరువులో పడి యువకుడి మృతి

నారాయణపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కొండారెడ్డిపల్లి చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలం బాపన్‌పల్లికి చెందిన ముగ్గు గంగారాం (22) ఆదివారం ఉదయం బంధువు మల్లప్పతో కలిసి చెత్త ఏరేందుకు వెళ్లారు. చెరువులో ఇనుప రాడ్‌లను తీసేందుకు యత్నిస్తూ గంగారం ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి, జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

లాభాల 'పందిరి'

భూత్పూర్ మండలంలో పందిరి పద్ధతిలో సాగు చేసిన కాకర (ఫైల్)



» కూరగాయల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం » అర్ధ ఎకరానికి రూ. 50 వేలు
» ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు అవకాశం » పాలమూరుకు 20 యూనిట్లు

పాలమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఎండ, వాన, చలి.. ఏ కాలమైనా ఇదే పరిస్థితి. జిల్లా ప్రజలకు సరిపడా కూరగాయలను స్థానిక రైతులు పండించకపోవడమే అందుకు ప్రధాన కారణం. వ్యాపారులు ప్రతీ రోజు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని విక్రయిస్తుండటంతో ధరల పెరుగుదల అనివార్యంగా మారింది. దీంతో ప్రజలకు ఆర్థిక భారం తప్పడం లేదు. దళారులు మాత్రం లాభాలు ఆర్జిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు శంషాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతాలు సమీపంలోనే ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కూరగాయాలకు భారీ డిమాండ్ ఉంటుంది. అయినా జిల్లా రైతులు ఎక్కువగా వరి, పత్తి, కంది, మొక్కజొన్న తదితర పంటలనే సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పండ్లు, పూల సాగు విస్తీర్ణం పెంపునకు లక్ష్యాన్ని నిర్దేశించి, ప్రణాళికను రూపొందించింది.

మహబూబ్‌నగర్ జిల్లాకు 20 యూనిట్లు

స్థానిక రైతుల దృష్టిని ఉద్యాన పంటలవైపు మళ్లించేందుకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్ధేశించింది. పందిరి సాగుకు ప్రోత్సాహం అందిస్తోంది. ఈ పద్ధతిలో కూరగాయల సాగుకు అర్ధ ఎకరానికి రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందిస్తోంది. ఆ డబ్బుతో పందిళ్లకు అవసరమైన రాతి స్తంభాలు (కడీలు), ఇనుప తీగ ఏర్పాటు చేసుకోవచ్చు. మహబూబ్‌నగర్ జిల్లాకు ప్రభుత్వం 20 యూనిట్లకు మంజూరు చేసి, రూ.10 లక్షలు కేటాయించింది. వాటిలో 9 యూనిట్లు పూర్తయ్యాయి. మిగిలినవి ప్రగతిలో ఉన్నాయి. ఒక్కో రైతుకు ఐదు యూనిట్ల వరకు, అంటే రెండున్నర ఎకరాల వరకు పందిరి సాగు చేసుకొనే అవకాశం కల్పించింది. సాగుకు ముందుకొచ్చే రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే వారి పొలాన్ని అధికారులు పరిశీలించి అనుమతి ఇస్తుంది. ఆ తర్వాత ఉద్యానశాఖకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది. మరో వైపు ఈ ఏడాది ఆయిల్‌పామ్ సాగును 2,500 ఎకరాల వరకు పెంచేలా అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 765.35 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు జిల్లా కలెక్టర్ పరిపాలన అనుమతిని ఇచ్చారు. అందులో 132 మంది రైతులు 491.60 ఎకరాల్లో సాగు చేశారు. వచ్చే ఏడాది నుంచి ఆయిల్‌పామ్ గెలలు దిగుబడి కానున్నాయి.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

మహబూబ్‌నగర్ జిల్లాలో వానాకాలం 834, యాసంగిలో 1,001 మొత్తం 1,835 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుతున్నాయి. జిల్లా నేలలు కూరగాయల సాగుకు అనుకూలం. టమాటా, వంకాయ, బెండకాయ, దొండకాయ, సోరా, చిక్కుడు, గోరుచిక్కుడు, దోసకాయ, మిర్చి, క్యాబేజీ, పొట్లకాయతో పాటు పాలకూర, మెంతి, కొత్తిమీర, పుదీనా, తోటకూర తదితర కూరగాయలు సాగు చేసుకోవచ్చు. కానీ రైతులు పెద్దగా ఆసక్తి చూపడంలేదు. జిల్లాలోని మహబూబ్‌నగర్ (2,62,311), దేవరకద్ర (2,40,980), జడ్చర్ల (2,24,477) నియోజకవర్గాల్లో మొత్తం 7,27,768 మంది జనాభా ఉంది. వారికి ఏటా దాదాపు 1,800 - 2,000 మెట్రిక్ టన్నుల వరకు కూరగాయల అవసరం అవుతాయి. కానీ జిల్లాలో 500 క్వింటాళ్ల వరకు కూరగాయలు ఉత్పత్తి అవుతున్నాయి. మిగిలినవి ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. వర్షాకాలంలో అధిక వర్షాలతో దిగుబడి తగ్గుతోందని, యాసంగిలో దిగుబడి ఉన్నా ధర రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగుకు ప్రోత్సాహం కరువు

ఉద్యానశాఖ, మార్కెటింగ్, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ దిగుబడులకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతీ రోజు రాత్రి వేళ రైతుబజార్, మార్కెట్లకు వెళ్తే, కూరగా యలు ఎక్కడి నుంచి వస్తాయో తెలుస్తుందని చెప్తున్నారు. వ్యాపారులు, దళారులకు అధికారులు కొమ్ము కాస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర జిల్లాల్లో 'మన ఊరికి సరిపడా కూరగాయలను మనమే పండించుకుందాం' అనే నినాదంతో రైతులను ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో కూడా ఈ విధానాన్ని అమలు చేయాల్సి ఉంది. ఉంది. నేలలు, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని ఏ మండలంలో ఏ కూరగాయలు సాగు చేయాలనే అంశంపై ఉద్యాన శాఖ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎన్ని కూరగాయలు అవసరమో చెప్పలేం



కె.వేణుగోపాల్, జిల్లా ఉద్యానశాఖ అధికారి : మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రజలకు ఎన్ని కూరగాయలు అవసరమో చెప్పలేం. జిల్లాలో ఎన్ని మెట్రిక్ టన్నులు పండిస్తున్నారు, ఇతర ప్రాంతాల నుంచి ఎంత మేరకు కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నారనే వివరాలు వ్యవసాయ లేదా మార్కెటింగ్ శాఖల అధికారులకు తెలుస్తాయి.

అధికారులు ఏమీ చెప్పడం లేదు



కె.వెంకట్‌రెడ్డి, రైతు, గుడిమల్కాపూర్ : ఎనిమిదేళ్ల నుంచి వరి సాగు బంద్ చేసి కూరగాయలు పండిస్తున్నాను. నాలుగు ఎకరాల్లో కాకర, టమాట, పుచ్చకాయ సాగు చేస్తున్నాను. ఉద్యాన శాఖ అధికారులు ఏమీ చెప్పడం లేదు. మా శక్తి మేర సాగు చేసుకుంటున్నాం. అధికారులు చొరవ తీసుకొని కూరగాయల సాగు, మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

మహోద్యమానికి సిద్ధం కావాలి

» కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

పాలమూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మనువాదానికి వ్యతిరేకంగా మహోద్యమానికి సిద్ధమవ్వాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, సీపీయం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఫూలే, అంబేద్కర్‌లను మొక్కుతూ వారి ఆశయాలను తొక్కుతున్న మతోన్మాదులు, కులవివక్ష, అసమానతలపై ప్రతిఘటన పోరాటాలు నిర్వహించాలని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అరుంధతిభవన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఆదివారం ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశానికి దశ, దిశా నిర్దేశం చేసేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి పొంచి ఉన్న మనువాద, మతోన్మాద ప్రమాదాన్ని ప్రతిఘటించడానికి విశాల ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. దేశంలోని కులాలు, మతాల మధ్య అసమానతలు సృష్టిస్తూ పరిపాలన కొనసాగిస్తున్న మనువాదుల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. రాజ్యాంగాన్ని తొలగించాలనే కుట్రలో భాగంగానే పార్లమెంటులో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడారని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకుని హిందుత్వ ఎజెండాను దూకుడుగా అమలు చేస్తూ దేశాన్ని అల్లకల్లోలం చేస్తోందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, మైనారిటీలపై దాడులు నిర్వహిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సనాతన ధర్మం ముసుగులో మనువాద భావజాలాన్ని అమలు చేస్తున్నాయని అన్నారు. హిందుత్వ శక్తులు దళితులు, అభ్యుదయవాదులు, మేధావులు, జర్నలిస్టులపై దాడులు చేస్తున్నాయన్నారు. అట్టడుగు వర్గాలైన దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, క్షేత్ర స్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేయాలన్నారు. సామాజిక అణిచివేతలకు, కులవివక్షకు వ్యతిరేకంగా అంబేడ్కర్, ఫూలే చూపిన దారిలో పయనిస్తూ ఉద్యమాలను తీవ్రతరం చేయాలన్నారు. దళితులు, పేదలు, బడుగు, బలహీన వర్గాలు దోపిడీకి గురవుతున్నారని, దోపిడీ చేసే వర్గానికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మాణిక్యం రాజు, ఎం.కుర్మయ్య, పొలడుగు నాగార్జున, నందిపాటి మనోహర్, మాణిక్యం, వెంకట్రాములు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మారణహోమం నిలిపి వేయాలి

» ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

పాలమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీలపై జరుగుతున్న మారణహోమాన్ని నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వనరుల దోపిడీని అరికట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అదివాసీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ఖండించారు. దండకారణ్యంలో పోలీసు క్యాంపులను ఎత్తివేయాలని, నల్లమల్ల చెంచుల తరలింపును ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్లను ఎన్నుకున్నారు. కె.వెంకటయ్య, శ్రీదేవి, గోపాల్, వామన్‌కుమార్, సతీష్, బాలయ్య, ఉదయమిత్ర, మన్యంకొండలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వివిధ సంఘాల నాయకులను కో-కన్వీనర్లుగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఎం.రాఘవాచారి, పి.బుచ్చారెడ్డి, అంబయ్య పాల్గొన్నారు.

గుడ్లనర్వలో గంజాయి కలకలం

బిజినేపల్లి, మార్చి2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నల్ జిల్లా, గుడ్లనర్వ గ్రామంలో మరోసారి గంజాయి కలకలం చెలరేగింది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో కొందరు యువకులు గంజాయి తాగుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వారు దాడి చేసి సదరు యువకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. గంజాయి ఎక్కడి నుంచి వచ్చిందో వివరాలను ఆరా తీస్తున్నారు. ఇదే గ్రామంలో మూడు నెలల క్రితం ఇద్దరు యువకులు గంజాయి తాగుతూ పట్టుబడిన విషయం తెలిసింది. ఆ సంఘటనను మరవక ముందే మరో ఘటన జరగడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

శంకరా.. సదాశివా!

» ఆత్మకూరులో మారుమోగిన శివనామస్మరణ
» చర్ల పరమేశ్వరుడికి పట్టు వస్త్రాల సమర్పణ


స్వామివారికి పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆత్మకూరు, మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలో స్వయంభువు చర్ల పరమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అంతకు ముందు పట్టణంలోని వేంకటేశ్వర స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపుగా పరమేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువకులు కోలాటాలు వేశారు. కళాకారులు భజన కీర్తనలు ఆలపించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో పట్టణం మారుమోగింది. అనంతరం స్వామి వారికి పట్టు వస్త్రాలను అలంకరించారు. ఆ తర్వాత రాత్రి 9:30 గంటలకు రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుర ప్రముఖులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకట నరసింహారావు, కోశాధికారి మణివర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయి రాఘవ, ఉపాధ్యక్షుడు యాదగిరిశెట్టి పాల్గొన్నారు


ఊరేగింపులో కోలాటం వేస్తున్న యువకులు

ఉత్తమ ఫలితాలు సాధించాలి

» షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్ క్షితిజ

మూసాపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్ క్షితిజ విద్యార్థులకు సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండల కేంద్రంలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఆదివారం ఆమె తనిఖీ చేశారు. వంట గది, డైనింగ్ హాల్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధం అవుతున్నారో తెలుసుకున్నారు. కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వసతి గృహానికి అవసరమైన మరమ్మతులు, నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలను పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంఘిక సంక్షేమ శాఖ డీడీ సుదర్శన్, హెచ్‌డబ్ల్యూవోలు అనంద్‌జీ, కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమలలో మళ్లీ మంటలు

» అదుపు చేసేందుకు అటవీశాఖ సిబ్బంది యత్నం

దోమలపెంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమల అడవిలో మళ్లీ మంటలు చెలరేగాయి. దోమలపెంట రేంజ్ పరిధిలో ఎర్రకురువ ప్రాంతంలో ఆదివారం రాత్రి అడవికి నిప్పంటుకొని, మంటలు భారీగా ఎగిసిపెడుతున్నాయి. అటవీశాఖ అధికారులు రెండు ఫైర్ టీంలతో మంటలను అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు. ఆ ప్రాంతంలో గడ్డి ఏపుగా పెరిగి ఉండటంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని అటవీశాఖ అధికారులు చెప్తున్నారు. కొండలు, గుట్టల ప్రాంతం కావడం, చీకటి పడటంతో మంటలను అదుపు చేయడం ఇబ్బందిగా మారింది. దోమలపెంట రేంజ్ పరిధిలో ఇప్పటికే వందల హెక్టార్ల విస్తీర్ణంలో అడవి దగ్ధమైంది. అదే ప్రాంతంలో మరో సారి మంటలు చెలరేగడం ఆందోళన కలిగిస్తోంది.


నల్లమల అడవిలో చెలరేగిన మంటలు

న్యూస్ బాక్స్

పదో తరగతిలోనే భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్ క్షితిజ

కొత్తకోట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బంగారు భవిష్యత్‌కు విద్యార్థులు పదో తరగతిలోనే బాటలు వేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్ క్షితిజ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే ఇంటర్, డిగ్రీలో అదే స్థాయి మార్కులు సాధించి తల్లిదండ్రులు గర్వపడేలా ఉద్యోగం చేయవచ్చన్నారు. పరీక్షల సమయం దగ్గర పడిందని, ఈ సమయంలో ఇష్టంతో పట్టుదలగా చదవాలని సూచించారు. భోజన వసతిపై ఆరా తీశారు. అనంతరం వంట గది, కూరగాయలు, రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట జిల్లా అధికారి మల్లేశం, సంక్షేమ వసతి గృహాల అధికారులు సంతోష్ కుమార్, జ్యోతి ఉన్నారు.

నేడు వెల్టూరు పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తకోట, మార్చి2, (ఆంధ్రజ్యోతి) : వెల్టూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పెద్దమందడి మండల విద్యుత్ శాఖ అధికారి సుధాకర్ తెలిపారు. వేసవి కాలం రావడంతో ముందు జాగ్రత్తగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ 3.15 ఎంవీఏ నుంచి 5 ఎంవీఏ పెంచడం జరుగుతుందని, దీంతో మరమ్మతులు చేయడం కోసం విద్యుత్ సరఫరాలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిలిపివేయనున్నట్లు చెప్పారు. రైతులు, గ్రామాల ప్రజలు ఇది గమనించాలని సూచించారు. వెల్టూరు, గట్లఖానాపూర్, మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లి, బలిజపల్లి, చిలుకటోనిపల్లి, ఉద్యాన కళాశాల విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ఆ గ్రామాల రైతులు ప్రజలు సహకరించాలన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం



స్నేహ ఫౌండేషన్ యాజమాన్యంతో సమావేశమైన నాయకులు

కొత్తకోట, మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : మోజర్ల గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో కల్యాణ మండపం నిర్మాణం కోసం స్నేహ ఫౌండేషన్ కంపెనీ భారీ విరాళం అందజేశారు. దేవాలయ కమిటీ గ్రామ పెద్దలు కలిసి స్నేహ ఫౌండేషన్ యాజమాన్యాన్ని సంప్రదించగా... నూతనంగా నిర్మించే కల్యాణ మండపం షెడ్డు నిర్మాణానికి రూ.11,00,116 అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన స్నేహ ఫౌండేషన్‌కి దేవాలయ కమిటీ, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టపగలే నిర్లక్ష్యపు వెలుగులు



ఆత్మకూరు మునిసిపల్ కార్యాలయం ఎదుట వెలుగుతున్న విద్యుత్ లైట్

ఆత్మకూరు, మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని ఆత్మకూరు, అమరచింత ప్రధాన రహదారి, పట్టణంలో అనేక చోట్ల పట్టపగలే విద్యుత్ దీపాల వెలుగులు విరజిమ్ముతున్నాయి. విద్యుత్, మునిసిపల్ శాఖల సిబ్బంది పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లుగా కనబడుతుందని పలువురు పట్టణవాసులు విమర్శిస్తున్నారు. విలువైన విద్యుత్ వృథా అవుతుందని, అలాగే వీధి దీపాల నిర్వహణలోని సమస్యలను విద్యుత్, మునిసిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు పరామర్శ

పాన్‌గల్, మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కేతేపల్లి గ్రామ మాజీ వార్డు సభ్యుడు, బీఆర్ఎస్ కార్యకర్త మౌలాలి 20 రోజుల కిందట బైక్ పైనుంచి కింద పడిపోవడంతో కాలు విరిగింది. దీంతో ఇంట్లో ఉన్న బాధితుడిని మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌లో పని చేసే ప్రతీ కార్యకర్తకు, కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని అన్నారు. నాయకులు జ్యోతినందన్ రెడ్డి, అడ్వకేట్ రవికుమార్, వెంకటయ్య నాయుడు పాల్గొన్నారు.



కార్యకర్తను పరామర్శిస్తున్న నాయకులు

గోపాలమిత్రల గోడు పట్టదా!

- ఉద్యోగ భద్రత కరువు
- మొబైల్ వైద్యులుగా సేవలు
- చాలీ చాలని వేతనం

మదనాపురం, మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో జీవాల పెరుగుదల, పాడి పరిశ్రమ అభివృద్ధికి వైద్య సేవలు అందించేందుకు గోపాలమిత్రలు తీవ్రంగా కృషి చేస్తున్నారు. జిల్లాలో 26 మంది ఉండగా.. వారికి నెలకు కేవలం రూ.11,500 మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుంది. 24 ఏళ్లుగా వెట్టి చాకిరి చేస్తున్నా... ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కనీస వేతనాలకు నోచుకోక దుర్భర జీవితం గడుపుతున్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా వేసే ప్రతీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంలో గోపాలమిత్రలు కీలకంగా పని చేస్తున్నారు. పశువులకు అర్ధరాత్రి సమయంలో రోగం వస్తే ఒక్క ఫోన్ కాల్‌తో అక్కడికి వచ్చి మొబైల్ వైద్యం చేస్తున్నారు. కానీ వారిని పర్మినెంట్ మాట అటు ఉంచితే కనీస వేతనం కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇచ్చే జీతాలు కూడా సరైన సమయంలో రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పశువైద్యాధికారులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం నిర్వహించే ప్రత్యేక క్యాంపులో వారికి సమయం ఇస్తూ వాటిని విజయవంతం చేస్తున్నారు. కనీస వేతనం రూ.18 వేల వరకు ఇవ్వాల్సి ఉండగా...

నేటికి అది అమలుకు నోచుకోకపోవడమే గాక గ్రామాల్లో నిత్యం బైక్‌పై ప్రయాణిస్తూ వైద్య సేవలు అందిస్తున్నా.. ఇన్సూరెన్స్ సదుపాయం కూడా లేదు. ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని వారు కోరుతున్నారు.



గేదెకు వైద్యం అందిస్తున్న గోపాలమిత్రలు(ఫైల్)

ఓఎస్‌లుగా గుర్తించాలి

ఏళ్ల తరబడి పని చేస్తున్న మమ్మల్ని ఆఫీస్ సబార్డినేట్‌గా గుర్తించాలి. అర్హులకు వెటర్నరి అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలి. కనీస వేతనం రూ. 18 వేలు అమలు చేయాలి.



- తిరుపతయ్య గోపాలమిత్ర మదనాపురం

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



క్రీడాకారులతో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆత్మకూరు, మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : చర్ల పరమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆత్మకూరు జాతర మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ క్రీడా పోటీలను ఆత్మకూరు మండల పరమేశ్వర స్వామి కమిటీ, పట్టణ ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ క్రీడా పోటీలను శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించగా.. ఈ క్రీడా పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి 40టీంలకు పైగా పాల్గొని ప్రతిభ కనబరుస్తున్నారు. ఆదివారం వరకు ఈ క్రీడా పోటీలు కొనసాగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహరావు, కోశాధికారి మనివర్ధన్ రెడ్డి లు, పరమేష్, శ్రీనివాసులు, రహమతుల్లా, తులసిరాజ్, గణేష్ ముదిరాజ్, సాయి రాఘవ, దామోదర్, మహేష్ , నగేష్ పాల్గొన్నారు.

మామిడిమాడకు బ్యాంక్ సేవలు అందించడం హర్షణీయం

ఖిల్లాఘణపురం, మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిమాడకి ఎస్‌బీఐ కస్టమర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఎం రేవంత్‌రెడ్డి సభలో ఎంపీ మల్లు రవి ప్రకటించడం హర్షణీయమని పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర రావు తెలిపారు. మామిడిమాడ గ్రామ ప్రజలు దశాబ్ద కాలంగా బ్యాంకు సేవలు అందుబాటులోకి తేవాలని ప్రజా ప్రతినిధులను పలుమార్లు కోరినా.. పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఎంపీ మల్లురవి, కాంగ్రెస్ మండల నాయకుడు సాయిచరణ్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఎస్‌బీఐ బ్యాంకు సేవలు అందుబాటులోకి రావడంపై వారికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకు సేవలు రావడంతో గ్రామంలో వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాములు నాయక్, మాజీ సర్పంచ్ మోహన్‌జి, కాంగ్రెస్ నాయకులు జితేందర్ రెడ్డి, లింగం, దానయ్య, వెంకటేష్, శ్యాంసుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన నాయకులు



సీఎం సభకు తరలి వెళ్తున్న కమలొద్దీన్‌పూర్ గ్రామస్థులు

ఖిల్లాఘణపురం, మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ తెలిపారు. మహిళలు, యువకులు స్వచ్ఛందంగా సీఎం రేవంత్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వెళ్లడంపై సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని గ్రామాల నుంచి సుమారు 3వేల మంది ప్రజలు సీఎం సభలో పాల్గొన్నట్లు తెలిపారు.

పాన్‌గల్ : వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం కొనసాగిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు మండల పరిధిలోని వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అందని సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అందుతున్నాయని అన్నారు. రానున్న రోజుల్లో రైతులకు మహిళలకు సంక్షేమ పథకాలు అందుతాయని తెలియజేశారు.

చిన్నంబావి మండలం నుంచి..

చిన్నంబావి : మండలంలోని పలు గ్రామాల నుంచి సీఎం సభకు కాంగ్రెస్ కార్యకర్తలు చంద్రశేఖర్ యాదవ్, బీచుపల్లి యాదవ్, కృష్ణ ప్రసాద్ యాదవ్, రామచంద్రారెడ్డి మాహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. అనంతరం వీపనగండ్ల మండలంలోని పలు గ్రామాల నుంచి సీఎం సభకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎత్తం కృష్ణ, బీరయ్య, మాహిళా సంఘాల సభ్యులు తరలివెళ్లారు.



సీఎం సభకు వెళ్తున్న మల్కాపూర్ గ్రామస్థులు

భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు



ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

అమరచింత, మార్చి2, (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసం మొదటి ఉపవాస దీక్ష ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు కొనసాగే పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలు వందలాది మంది ముస్లింలు మొదటి రోజు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరచింత, నందిమల్ల, మసీదులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుత్ కాంతులతో మసీదులు ఆకట్టుకుంటున్నాయి. సాయంత్రం జరిగిన ఇఫ్తార్‌లో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమరచింత జామియా మసీదుకు మసీదు ఆవరణలోని కమాన్‌కు, రెహమానియా మసీదులు విద్యుత్ కాంతులతో ఆకట్టుకుంటున్నాయి.



విద్యుత్ కాంతులతో అమరచింత జామియా మసీదు

పడకేసిన పల్లె దవాఖానాలు

- ఆసుపత్రులకు పరిమితమవుతున్న ఎంఎల్‌హెచ్‌పీలు
- పల్లె ప్రజలకు అందని వైద్య సేవలు
- అసంపూర్తిగా ఆరోగ్య ఉపకేంద్రాలు

చిన్నంబావి మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాల లక్ష్యం నెరవేరడం లేదు. హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలు (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)గా మార్చారు. ప్రభుత్వం ఎంబీబీఎస్ డాక్టర్లను పల్లె దవాఖానాల్లో నియమించింది. ఎంఎల్ హెచ్‌పీ (మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్)లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకే పరిమితం కావడంతో పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందడంలేదు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇచ్చే మాత్రలు మినహా మెరుగైన వైద్యం అందడం లేదనే ఆరోపణలున్నాయి. కొప్పునూరు పెద్దదగడ ఆరోగ్య ఉప కేంద్రాలు కొన్నేళ్లుగా బీఏఎంహెచ్‌లను నియమించారు. వీరు ఉప కేంద్రాలకు మొక్కుబడిగా వెళ్తూ... ఆరోగ్య కేంద్రాల్లో ఉండడంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారిపోతోంది

అదనపు సేవల కోసమే ఆరోగ్య మందిరాలు

గ్రామీణ ప్రాంతాల్లో అదనపు సేవలు అందించేందుకు ప్రతీ సబ్ సెంటర్‌లో పల్లె దవాఖానా (ఆరోగ్యమందిర్)లు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఒక ఎంఎల్‌హెచ్‌పీతో పాటు స్టాఫ్‌నర్సు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలి. ఈ కేంద్రాల్లో మాతాశిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ, అంటువ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధులకు చికిత్స అసంక్రమిత వ్యాధుల బారిన పడిన వారికి మాత్రలు పంపిణీ చేయాలి.

రోగులను పరీక్షించి అవసరాన్ని బట్టి ఆసుపత్రులకు రెఫర్ చేయాలి. పల్లె దవాఖానాల్లో సిబ్బంది ఉండకపోవడంతో వైద్య సేవలు అందడం లేదు.



కొప్పునూర్‌లో తెరచుకోని పల్లె దవాఖాన

ఆదివాసీలకు అందుబాటులో లేని వైద్యం

మండలంలోని 17 గ్రామపంచాయతీలు, అటాచ్ గ్రామాలు రెండు, ఒక తండా మొత్తం 20 గ్రామాల్లో 29 వేలకు పైగా జనాభా ఉంది. మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడం, ఇందులో ఏజెన్సీతో కొనసాగుతున్నాయి. ఆరు హెల్త్ సబ్‌సెంటర్లు. ఆదివాసీలకు మెరుగైన వైద్య సేవలందించడం లేదనే ఆరోపణలు

వినిపిస్తున్నాయి. ఆదివాసీ లకు మెరుగైన వైద్య సేవలందించాలంటే మరో పల్లె దవాఖానా ఏర్పాటు చేయాలని ఆదీవాసీలు కోరుతున్నారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణ జాతీయ రహదారి మదర్ థెరిస్సా జంక్షన్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం యంత్ర, హోమ పూజలు నిర్వహించారు. 200 దేవాలయాలకు ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించిన నంది వెలుగు బ్రహ్మ శ్రీ బాలాజీ గురుకుల్ బృందం స్థల సంప్రోక్షణ శ్రీలక్ష్మీ గణపతి హోమం, వాస్తు హోమం, నవధాన్యాలు, నవరత్నాలు, పంచలోహాలతో యంత్రస్థాపన పూజలు నిర్వహించారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు విశ్వేశ్వర్, డాక్టర్ పీజే. బాబు, మాజీ ఎంపీపీ మౌనిక, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ కార్యక్రమాల్లో అయ్యప్ప సేవా సమితి వ్యవస్థాపకుడు గోపాలకృష్ణ, మండల అధ్యక్షుడు నాగరాజు, సభ్యులు లింగేశ్వర్, గంగాధర్, ప్రకాష్, సత్యం సాగర్, లక్ష్మీనారాయణ యాదవ్, రాజశేఖర్, మణికంఠ రాజు, కిషోర్ కుమార్, కవీందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శివ కుమార్‌రెడ్డి, విశ్వమోహనాచారి, భాస్కర్, రవీగౌడ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

కోట మైసమ్మను దర్శించుకున్న రావుల



పూజలు నిర్వహిస్తున్న రావుల చంద్రశేఖర్‌రెడ్డి

కొత్తకోట, మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అల్వాలలో జరిగిన పెద్దమ్మ పండుగ సందర్భంగా గ్రామదేవత కోట మైసమ్మను మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ దేవత ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాలు పెంపొందించడంతో పాటు ఐక్యత కలిగిస్తాయని అన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా దేవాలయాన్ని నిర్మించి ఉత్సవాలు నిర్వహించిన కమిటీ సభ్యులను సహకరించిన గ్రామ పెద్దలు అల్వాల వెంకట్‌రెడ్డిని అభినందించారు. రావుల చంద్రశేఖర్‌రెడ్డి వెంట జిల్లా మీడియా కన్వీనర్ నందిమళ్ల అశోక్, బీఆర్ఎస్ నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఎండీ గౌస్, కొత్తకోట బాలయ్య తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు



వనపర్తి బస్టాండ్‌లో ఎగబడి బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

వనపర్తి రూరల్, మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులు సరైన సమయంలో అందుబాటులో లేక ప్రయాణికులు ఆదివారం ఇబ్బందులకు గురయ్యారు. వనపర్తి పట్టణ కేంద్రంలోని సీఎం రేవంత్‌రెడ్డి సభ ఉండడంతో వనపర్తి డిపోకు చెందిన బస్సులను సీఎం సభకు ప్రజలను తరలించేందుకు బస్సులను మళ్లించడంతో ఇతరాత్ర దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు. అటు హైదరాబాద్, మహబూబ్‌నగర్, కర్నూల్ ఇతరాత్ర గ్రామీణ ప్రాంతాలకు రోజు వారీగా వెళ్లే బస్సులు అందుబాటులో లేకపోవడంతో చాలా మంది ప్రయాణికులు ఉన్న కొద్దిపాటి బస్సులకు పోటీ పడ్డారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్తకోట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మోహన్‌రెడ్డి సతీమణి భారతి అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ... శనివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మోహన్‌రెడ్డి ఇంటికెళ్లి మృతిరాలికి పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్, శ్రీనివాసులు నాయకులు కృష్ణారెడ్డి, బోయోజ్, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సుభాష్, మిషేక్, నరేందర్‌సాగర్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ రిజర్వు స్థానం కేటాయించాలి



ఆత్మకూరులో సంతకాల సేకరణ చేపట్టిన యువకులు

ఆత్మకూరు, మార్చి2, (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మునిసిపాలిటీ కేంద్రంలో ఎస్సీ రిజర్వు స్థానం కేటాయించాలని కోరుతూ ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఐదో వార్డులో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణ మాదిగతో పాటు యువకులు ఆదివారం సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజల అభిప్రాయం సేకరించినట్లు తెలిపారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ఆత్మకూరు గ్రామపంచాయతీ, మేజర్ గ్రామపంచాయతీ, మునిసిపాలిటీ కేంద్రంగా ఏర్పడిన ఇప్పటి వరకు ఎస్సీ రిజర్వుడు సర్పంచ్, మునిసిపాలిటీ చైర్మన్‌గా రిజర్వేషన్ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ కేంద్రంలో 2 వేలకు పైగా ఎస్సీ ఓటర్లు ఉన్న ప్రభుత్వం గుర్తించడం లేదని వాపోయారు. ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా ఎస్సీలకు రిజర్వు స్థానం కేటాయించాలని కోరారు.

కార్యక్రమంలో పట్టణ ఎస్సీ యువకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు



మదనాపురంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడిని అరెస్టు చేసిన పోలీసులు

మదనాపురం, మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ముందస్తుగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు కృష్ణయ్య యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులను అక్రమ అరెస్టులు చేయించడం తన పాలనపై వైఫల్యాలకు నిదర్శనమని అన్నారు. ఆయనకు మద్దతుగా పలువురు మండల బీఆర్ఎస్ నాయకులు అన్ని గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు పోలీస్ స్టేషన్ చేరుకొని అక్రమ అరెస్టును ఖండించారు. ఆవుల బాలకృష్ణ, దేశి వెంకటేష్ యాదవ్, శ్రీనివాసులు, మనోజ్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం నాయకులు..

అమరచింత, మార్చి 2, (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రానికి సీఎం రేవంత్‌రెడ్డి రావడంతో ముందస్తుగా అమరచింత పోలీసులు పలు విద్యార్థి సంఘం నాయకులను ఆదివారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సి.రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ, రాకేష్ తదితరులను పోలీసులు సీఎం సభకు వెళ్లకుండా అరెస్టు చేశారు. విద్యారంగ సమస్యలపై సీఎంను అడగాలని చూస్తే... పోలీసులు అక్రమ అరెస్టు చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు.



అమరచింత పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన విద్యార్థి సంఘం నాయకులు